




'సిక్స్'లైన్ ...జాతికి అంకితం

వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో


ఎట్టకేలకు తిరుపతి - నాయుడుపేట సిక్స్‌లైన్ రహదారి పనులు పూర్తయ్యాయి. నాలుగేళ్ల క్రితం కేంద్ర, రాష్ట్ర నిధులతో చేపట్టిన ఈ రహదారి నిర్మాణాన్ని 'మెగా' సంస్థ కాంట్రాక్టు తీసుకుంది. రెండు విడతలుగా రూ.2,510 కోట్ల వ్యయంతో 57 కిలోమీటర్ల దూరం ఈ రహదారి నిర్మించారు. నాయుడుపేట - తిరుపతి వరకూ ఈరోడ్డు విస్తరించింది. వర్చువల్ విధానంలో రాష్ట్రానికి విచ్చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ సిక్స్‌లైన్ రహదారిని ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఒకప్పట్లో నాయుడుపేట నుంచి తిరుపతికి రావాలంటే 2-3 గంటల సమయం పట్టేది. ప్రస్తుతం ఈ సిక్స్‌లైన్ రహదారి నిర్మాణం పూర్తి కావడంతో 57 కిలోమీటర్ల దూరం కేవలం గంటలోపే వాహనదారులు తిరుపతికి చేరుకోవచ్చు. చెన్నయ్- బెంగుళూరు- విజయవాడ- కడప ప్రాంతాలను ఈ సిక్స్‌లైన్ కలపనుంది. యాత్రికులకే కాకుండా, పారిశ్రామికవేత్తలకు ఈ రహదారి ఉపయోగపడుతుంది. నాయుడుపేట రింగ్‌రోడ్డు దక్షిణభారతదేశంలోనే ఎక్కడా లేని విధంగా ఈ రోడ్డు నిర్మాణం జరిగింది. దారి పొడవునా ఎల్ఇడి లైట్లు జిగేల్‌మంటూ ప్రయాణికులు క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. గతంలో సింగిల్‌రోడ్డు ఉన్నపుడు రోజుకో ప్రమాదం జరిగి అటు భక్తులు, ప్రయాణికుల ప్రాణాలు గాల్లో కలిసిపోయేవి. అతివేగంగా, స్వల్ప వ్యవధిలోనే గమ్యస్థానాలకు చేరుకోవచ్చు. ప్రమాదాల నివారణకు ఈ రహదారి ఉపయోగపడుతుంది. ఈ రోడ్డును కలుపుతూ గాజులమండ్యం నుంచి సి.మల్లవరం వరకూ ఇదే సిక్స్‌లైన్ 12 కిలోమీటర్ల దూరంలో శరవేగంగా పనులు జరుగుతున్నాయి. అయితే 'మెగా' సంస్థకు ఈ కాంట్రాక్టు దక్కలేదు. చెన్నయ్‌కి చెందిన ఓ బడా బిల్డర్ ఈ పనులను దక్కించుకున్నారు. నేషనల్ హైవే అథారిటీ రోడ్డుకు సంబంధించిన కోర్టు వివాదాలను, ల్యాండ్ మార్కింగ్‌ను పూర్తి చేసుకుంది. ప్రస్తుతం రోడ్డుకు ఇరువైపులా సిక్స్‌లైన్ నిర్మాణం శరవేగంగా పూర్తి చేస్తూ మార్చి నాటికి పూర్తికానుంది. కేంద్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వచ్చే ఏడాది మార్చి ఈ 12 కిలోమీటర్ల రహదారిని ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు.


బర్డ్‌లో చిన్నారుల పుట్టినరోజు జరుపుతున్న జి.జగదీష్ (ఫైల్‌ఫోటో)

'బర్డ్'కు మహర్దశ

డైరెక్టర్‌గా డాక్టర్ జి.జగదీష్ పునరాగమనం/ టిటిడి ఈవో ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నడుస్తున్న బర్డ్ ఆసుపత్రికి మహర్దశ రానుంది. డైరెక్టర్‌గా ప్రముఖ ఆర్థోపెడిషన్ డాక్టర్ జి.జగదీష్‌ను నియమిస్తూ టిటిడిఈఓ శ్యామలరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో డైరెక్టర్‌గా పనిచేసిన జగదీష్ బర్డ్ ఆస్పత్రికి జాతీయ స్థాయి గుర్తింపు తీసుకొచ్చారు. దీంతో దేశ నలుమూలల నుంచి ఆర్థో వైద్యసేవల కోసం రోగులు బర్డ్‌కు వచ్చి వెళ్లేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత బర్డ్ ఆస్పత్రి అభివృద్ధి కోసం డాక్టర్ జగదీష్‌ను మళ్లీ తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచన. ఈ నేపథ్యంలో జగదీష్‌కు మళ్లీ డైరెక్టర్ పదవి వరించింది. త్వరలోనే ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

ప్రస్తుతం జగదీష్ చేస్తున్న సేవలు

ప్రస్తుతం తిరుపతి లోని రాష్ట్రీయ సేవా సమితి ,వెంకటగిరి జిఎన్ఆర్ ట్రస్ట్, నెల్లూరు వెంకయ్య స్వామి ఆలయం అనుబంధంగా ఉన్న ఆసుపత్రి, కరేడు గ్రామంలోని అన్నపూర్ణమ్మ ట్రస్ట్, వడ్లమూడి లోని డి వి సి ట్రస్ట్ హాస్పిటల్, గుంటూరు విజయవాడలోని రమేష్ హాస్పిటల్ వైద్య కళాశాలలో శల్య వైద్య విభాగాధిపతిగా, హైదరాబాదులోని గ్రీన్ మెడ్ ఆసుపత్రులలో రోగులను పరీక్షించి వారికి అవసరమైన శాస్త్ర చికిత్సలు అందిస్తున్నారు. ప్రధానంగా ప్రకాశం జిల్లా కరేడు గ్రామంలోని జాలర్ల ప్రాంతాన్ని ఆయన దత్తత తీసుకున్నారు. ఆ ప్రాంతంలోని జాలర్లకు అవసరమైన వైద్య సేవలతో పాటు పూర్తిస్థాయిలో మందులను ఉచితంగా అందజేయనున్నారు. టి.టి.డి. బర్డ్ ట్రస్ట్ హాస్పిటల్ డైరెక్టర్‌గా ఉన్నపుడు డాక్టర్ జగదీష్ కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు దేశవ్యాప్తంగా ఉచిత పోలియో సర్జికల్, స్క్రీనింగ్ శిబిరాలకు నాయకత్వం వహించారు. నలభై మూడు సంవత్సరాల తన సేవలో భారతదేశంలో మాత్రమే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో వికలాంగుల జీవితాలను మెరుగుపరచడానికి అనేక క్యాంపులను నిర్వహించి, 1,83,000 కు పైగా శస్త్ర చికిత్సలు చేయడం ద్వారా ఎంతో మందిని అంగ వైకల్యం పై విజయం సాధించేలా కృషి చేశారు. ఈ విజయం ప్రపంచవ్యాప్తంగా అసమానమైనదని గుర్తు చేశారు.

'విశ్వ వైద్య దివ్యాంగ బంధు' అవార్డు

మారిషస్ తెలుగు మహా సభ ఆధ్వర్యంలో శ్రీ విశ్వావసు నామ తెలుగు సంవత్సర ఉగాది వేడుకలు వైభవంగా నిర్వహించారు. మారిషస్ రాజధాని ఫీనిక్స్‌లోని ఇందిరా గాంధీ సెంటర్ ఫర్ ఇండియన్ కల్చర్ ఈ వేడుకలు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రపంచ ప్రఖ్యాత వైద్య నిపుణుడు డాక్టర్ గుడారు జగదీష్ వైద్య రంగంలో చేసిన అసాధారణ కృషికి, ముఖ్యంగా వికలాంగుల శ్రేయస్సు కోసం వారి యొక్క అచంచలమైన అంకితభావానికి గుర్తింపుగా మారిషస్ ప్రధాన మంత్రి సత్కరించారు. నాలుగు దశాబ్దాలుగా వికలాంగుల పునరావాసం, సమాజ సేవకు అంకితమైన డాక్టర్ జగదీష్ దేశ విదేశాలలో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన అవిశ్రాంత సేవ ఎంతో మంది అభాగ్యుల జీవితాలను ప్రభావితం చేసింది. ఈ సేవలను గుర్తించిన మారిషస్ ప్రధాన మంత్రి డాక్టర్ నవీన్‌చంద్ర రామ్ గూలమ్ డాక్టర్ గుడారు జగదీష్‌ను "విశ్వ వైద్య దివ్యాంగ బంధు" అవార్డుతో సత్కరించారు. మారిషస్ ప్రధాన మంత్రి డాక్టర్ నవీన్‌చంద్ర రామ్ గూలమ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లోని ఒక సాధారణ వ్యవసాయ కుటుంబం నుండి వచ్చిన డాక్టర్ జగదీష్ కాకినాడలోని రంగరాయ మెడికల్ కాలేజీ, మంగళూరులోని మణిపాల్ విశ్వవిద్యాలయం వంటి ప్రఖ్యాత వైద్య సంస్థలలో వైద్య విద్యను అభ్యసించి ఆర్థోపెడిక్స్ విభాగంలో నైపుణ్యం పొంది, ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధ సంస్థల నుండి అత్యాధునిక పద్ధతులలో అధునాతన శిక్షణ సైతం తీసుకున్నారని తెలిపారు. అమెరికా, జర్మనీ, ఇంగ్లాండు, ఇటలీ, ఫ్రాన్స్, నైజీరియా, కెన్యా, ఒమన్, స్విట్జర్లాండ్ మరియు మారిషస్‌లలో కూడా ఉచిత క్యాంపులు నిర్వహించి తన సేవలను విస్తరించి, అనేక జాతీయ మరియు అంతర్జాతీయ జర్నల్స్‌లో తన పరిశోధనలు ప్రచురించారని తెలిపారు. రాబోయే రోజుల్లో మారిషస్‌కు కూడా డాక్టర్ జగదీష్ తన సేవలను అందించాలని ప్రధాని ఆకాంక్షించడం గమనార్హం.

అదుపుతప్పి కారు బోల్తా ఇద్దరు దుర్మరణం

కాశిపెంట్ల జాతీయ రహదారిపై ఘటన

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి)



పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారి చంద్రగిరి మండలం కాశిపెంట్ల సమీపంలో కారు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు మృతిచెందారు. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే... బెంగళూరు లగేరియాకు చెందిన మారియప్ప కుటుంబ సభ్యులుతో శుక్రవారం తిరుమలకు బయలు దేరాడు. మార్గమధ్యంలోచంద్రగిరి మండలం కాశిపెంట్ల సమీపంలో వెళుతుండగా తమ కారు ముందర వెళుతున్న మరో వాహనాన్ని అధిగమించబోయి పక్కనే ఉన్న కల్వర్టును అతివేగంగా ఢీకొని పల్టీలు కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న కరియేడు అలియాస్ మారియప్ప (62), నూతన్ (6) లు కారు నుండి కిందపడి రక్తగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. మంజునాథ్ (35) సౌమ్య (38) శాంతమ్మ లకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించి ఎస్.ఐ అనిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ప్రాణాలు కాపాడిన 'తిరుపతి శక్తి టీం'

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



కమాండ్ కంట్రోల్ నుండి సమాచారం వచ్చిన వేంటనే స్పందించి 15 నిమిషాల్లో మహిళ ప్రాణాలు కాపాడిన శక్తి టీం సిబ్బందిని జిల్లా ఎస్పి వి. హర్షవర్ధన్ రాజు అభినదించారు. హైదరాబాదుకి చెందిన లక్ష్మి నెల రోజుల క్రితం తిరుచానూరుకు చెందిన మహేష్‌ను వివాహం చేసుకుంది. వివాహం జరిగిన సమయం నుండి భర్త మహేష్ చిత్రహింసలకు గురి చేస్తున్నాడని లక్ష్మి ఆవేదన చెందింది. భర్త మహేష్ మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నాడని జీవితం పై విరక్తి చెంది చనిపోవాలనుకొని, తిరుమల కొండకు బయలు దేరానని ... పోలీస్ వాట్సాప్ నెంబర్ 8099999977 ఫోన్ చేసి పోలీసులకు చెప్పింది. దీంతో వెంటనే స్పందించిన కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది శక్తి టీం మహిళా సిబ్బంది ని అలెర్ట్ చేశారు. అలిపిరి వద్ద నుండి లొకేషన్ వస్తుందని శక్తి టీం మహిళ సిబ్బంది మరోసారి కమాండ్ కంట్రోల్ నుండి సమాచారం ఇచ్చారు. శక్తి టీం మహిళా సిబ్బంది అలిపిరి వద్ద కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న మహిళను కనుగొన్నారు. దీంతో అ మహిళ ఇచ్చిన సమాచారం తో భర్తను మందలించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు స్పందించి మహిళ ప్రాణాలు కాపాడినందుకు లక్ష్మి కుటుంబ సభ్యులు శక్తి టీం మహిళా సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఆత్మహత్య చేసుకోవటానికి ప్రయత్నం చేసిన మహిళను కాపాడిన ఏఎస్ఐ గిరిజ, ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ శాంతి, మహిళా పోలీసుల సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

కపిలతీర్థం ఆలయంలో భద్రతా దళాల మాక్ డ్రిల్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

కాశ్మీర్ లోని పహల్గామ్ ప్రాంతంలో ఉగ్రదాడి నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా తిరుపతిలోని శ్రీ కపిలతీర్థం ఆలయంలోకి ఉగ్రవాదులు చొరబడినప్పుడు ఎలాంటి భద్రతాపరమైన చర్యలు చేపట్టాలనే అంశంపై ఆక్టోపస్, పోలీసు, టిటిడి విజిలెన్స్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది సమిష్టిగా మాక్ డ్రిల్ నిర్వహించారు. ముందుగా కపిలతీర్థం సమీపంలో జిల్లా అటవీ శాఖ కార్యాలయం ప్రాంగణం నుండి ఆక్టోపస్ బలగాలు మూడు గ్రూపులుగా వ్యూహాత్మకంగా సమన్వయంతో ఆలయంలోకి ప్రవేశించి భక్తులను ఎలా రక్షించాలి అనే విషయాలను శుక్రవారం సాయంత్రం మాక్ డ్రిల్ ద్వారా చేసి చూపారు. దాదాపు రెండు గంటలపాటు ఈ మాక్ డ్రిల్ కొనసాగింది. ఈ మాక్ డ్రిల్ 40 మంది ఆక్టోపస్ కమాండోలు, 10 మంది టీటీడీ విజిలెన్స్ సిబ్బంది, 15 మంది పోలీసులు, 13 ఏఆర్ సిబ్బంది, 12 మంది మెడికల్ సిబ్బంది, ఫైర్ , ఆర్మ్ , బాంబ్ స్క్వాడ్, ఎలక్ట్రికల్ , వాటర్, గ్యాస్ శాఖల సిబ్బంది మాక్ డ్రిల్ లో భాగమయ్యారు. ఆక్టోపస్ అడిషనల్ ఎస్పి సి. రాజారెడ్డి, డిఎస్పీ మధుసుధన్ రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.


కపిలతీర్థం ఆలయంలో మాక్‌డ్రిల్

వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు : ఎస్‌పి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

వేసవికాలంలో దాహార్తి తీర్చేందుకు జిల్లావ్యాప్తంగా చలివేంద్రాలు ఏర్పాటు చేశామని ఎస్‌పి వి.హర్షవర్ధన్‌రాజు వెల్లడించారు. తాజాగా తిరుపతి బస్టాండ్ సమీపంలోని పూర్ణకుంభం పోలీసు ఔట్‌పోస్టు పక్కన ఆటోడ్రైవర్ల సమక్షంలో ప్రారంభించారు. తొలిరోజు మజ్జిగ, స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం ఆటో డ్రైవర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చలివేంద్రం వద్ద పోలీసు ఔట్‌పోస్టుల్లో ప్రజలకు అవగాహన కల్పించేలా వివిధ రకాలైన ఎనౌన్స్‌మెంట్స్ ఏర్పాటు చేశారు. హెల్మెట్ ధరించండి.. మీ ప్రాణాలను కాపాడుకోండి, నో పార్కింగ్- నో ఎంట్రీ అని అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి పరిపాలన కె.రవి మనోహర్‌ఆచారి, ట్రాఫిక్ డిఎస్‌పి రామకృష్ణ, డిఎస్‌పి భక్తవత్సలం పాల్గొన్నారు.

గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహిద్దాం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఎంతో ప్రాశస్త్యం కలిగిన తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది కలసికట్టుగా కృషి చేయాలని నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ ఎన్‌మౌర్య పిలుపునిచ్చారు. ఈనెల ఆరో తేదీ నుంచి జాతర ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఆలయంలో చేయాల్సిన పనులను శుక్రవారం కమిషనర్, మేయర్ ఆలయ అధికారులతో కలిసి పరిశీలించారు. భక్తులకు అవసరమైన తాగునీరు, పారిశుధ్యంపై అధికారులు ఎక్కువ దృష్టి సారించాలన్నారు. ఆలయ ఈ.వో.జయకుమార్, తుడా సూపరింటెండెంట్ ఇంజినీర్లు శ్యాంసుందర్, కష్ణారెడ్డి, మునిసిపల్ ఇంజినీర్ తులసికుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ ఉన్నారు.




'అమరా'లో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -రేణిగుంట

మేడే సందర్భంగా ఇండో- ఎంఐఎం కంపెనీ సహకారంతో అమరా ఫౌండేషన్ రక్తదాన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించింది. 50 మంది సభ్యులు పాల్గొన్నారు. ఇండో ఎంఐఎం ఇన్‌ఛార్జి దాసరి కిరణ్‌కుమార్ దాతలందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఆస్పత్రి న్యూరాలజిస్ట్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి గొర్నినేని, అమరా ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, ఆస్పత్రి నిర్వాహకురాలు శ్రీధర్ దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

నేటినుంచి ఎపిపిఎస్సీ గ్రూప్ 1 పరీక్షలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



ఈనెల 3-9 తేదీల్లో జరగనున్న ఎపిపిఎస్‌సి గ్రూప్ 1 సర్వీసెస్ మెయిన్స్ రాత పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో అసిస్టెంట్ సెక్రటరీలతో కలిసి సమీక్ష నిర్వహించారు. తిరుపతి జిల్లాలో ఈ పరీక్షలకు మొత్తం మూడు సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, 911 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. ముగ్గురు జిల్లా అధికారులు లైజన్ అధికారులుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 8.30 నుంచి 9.30 లోపు చేరుకోవలసి ఉంటుందన్నారు. అదనంగా గ్రేస్ పిరియడ్ 15నిమిషాలు మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు. సిసి కెమెరాల పర్యవేక్షణలో ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఎలక్ట్రానిక్ వాచ్‌లు, వైర్లెస్ హెడ్‌సెట్స్ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతి ఉండదన్నారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు, ఆర్టీసీ బస్సు సౌకర్యం, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తాగునీరు, టాయిలెట్లు సక్రమంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిపిఎస్‌సి అసిస్టెంట్ సెక్రటరీ బి.వెంకటలక్ష్మి, సెక్షన్ ఆఫీసర్లు ఆర్.సునీత, శివన్నారాయణరెడ్డి పాల్గొన్నారు.



మేడే ఉత్సవాల్లో ప్రసంగిస్తున్న ఓ.వెంకటరమణ

అలరించిన మేడే సాంస్కృతికోత్సవం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మేడే సాంస్కృతికోత్సవం వేడుకగా శుక్రవారం జరిగింది. ఇందులో భాగంగా దేశభక్తి, కార్మిక ,అభ్యుదయ పాటల పోటీలు నిర్వహించారు. ఓ. వెంకటరమణ సమన్వయకర్తగా వ్యవహరించారు. జడ్జిలుగా నంది అవార్డు గ్రహీత డాక్టర్ . ఆమూరి సుబ్రహ్మణ్యం ,ప్రజాగాయకుడు వేణు వ్యవహరించారు. ఈ పోటీలో చిన్నారి డి . దినశ్రీ ,పెద్ద వయస్కులు వెంకట శేషయ్య , డాక్టర్ కడివేటి మునిరత్నం, డాక్టర్ నారప్ప రెడ్డి, టీచర్ గురుస్వామి పాడడం విశేషం . అమరేశ్వరి అమ్మ గురించి పాడగా, మహిళా కండెక్టర్ గండికోట ప్రమీల తమ వత్తి కష్టాలపై తానే స్వయంగా పాట రాసి పాడారు. స్వర్ణ లత, రెడ్డప్ప, రాజశేఖర్, లీలా చౌదరి , పరంధామ శెట్టి, విజయలక్ష్మి తదితరులు తమ పాటలతో అలరించారు. ఈ సందర్భంగా వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి నాగార్జున మాట్లాడుతూ " మే డే పాటలు పోటీలు ప్రజా సంస్కతిని ప్రతిబింబించే విధంగా జరిగిందన్నారు. 3 వ తేదీ సాయంత్రం 4 గంటలకు అభ్యుదయ, దేశభక్తి, కార్మిక గేయాల నత్య ప్రదర్శనల పోటీలో పాల్గొవాలని కోరారు. 10 నిమిషాల స్కిట్ పోటీలో పాల్గొవాలని విజ్ఞప్తి చేశారు.

15-18 తేదీల్లో తిరుపతిలో ఎఐవైఎఫ్ జాతీయ మహాసభలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఈనెల 15-18 తేదీల్లో ఎఐవైఎఫ్ జాతీయ మహాసభలు జరుగుతాయని రాష్ట్ర సహాయ కార్యదర్శి కత్తి రవి వెల్లడించారు. ఈ మేరకు బైరాగిపట్టెడలోని కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మోడీ 2014 ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు విడుదల చేసి 10 ఏళ్లలో నిరుద్యోగమే లేకుండా చేస్తానని అబద్ధపు మాటలు చెప్పి ప్రధానిగా ఎన్నికై 11 ఏళ్ళు అవుతున్న ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని, పైగా నిరుద్యోగులను నిలువునా ముంచారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం మెగా డిఎస్‌సి సంబంధించి రోజుకో మాట చెబుతూ కాలయాపన చేస్తోందన్నారు. 29 రాష్ట్రాల నుంచి యువజన సమాఖ్య ప్రతినిధులు వెయ్యి మంది వస్తున్నారని,తిరుపతి నగరంలో జరిగే భారీ ర్యాలీలో పాల్గొంటారని తెలిపారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి యం రామకృష్ణ ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఉదయ్ కుమార్, సిహెచ్ ప్రవీణ్ కుమార్, విక్రమ్ పాల్గొన్నారు.

రేపు స్థానికులకు శ్రీవారి దర్శన టోకెన్ల జారీ

ప్రజాశక్తి -తిరుమల

ప్రతి నెలా మొదటి మంగళవారం 6వ తేది స్థానికులకు కల్పించే దర్శనంలో భాగంగా మే 4వ తేది ఆదివారం స్థానిక దర్శన కోటా టోకెన్లను టీటీడీ జారీ చేయనుంది. ఈ మేరకు తిరుపతి స్థానికులకు మహతి ఆడిటోరియంలోని కౌంటర్లలోను, తిరుమల స్థానికులకు బాలాజీ నగర్ కమ్యూనిటీ హాల్లో మొదట వచ్చిన వారికి మొదటి ప్రాతిపదికన ఉదయం 5 గంటల నుండి శ్రీవారి దర్శన టోకెన్లు జారీ చేయనున్నారు. ఈ విషయాన్ని గమనించి తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాలకు చెందిన స్థానిక భక్తులు ఆధార్ కార్డు చూపించి టోకెన్లు పొందాలని టిటిడి విజ్ఞప్తి చేసింది.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తెలుగు గంగ కాలనీలో ఉన్న గిరిజన సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో జూనియర్ ఇంటర్ ప్రవేశాలకు పదో తరగతి పాసైన ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యార్థినుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ దామోదర నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులకు దరఖాస్తు చేసుకునే విద్యార్థినులను పదో తరగతి మార్కుల మెరిట్ ఆధారంగా ఎంపిక చేయబడతారని వివరించారు. ఈ నెల 18వ తేదీ లోగా ఆన్లైన్ ద్వారా గానీ, ఆఫ్ లైన్ ద్వారా గానీ దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా సూచించారు. ఒక్కో గ్రూపుకు 40 అడ్మిషన్లు ఖాళీ ఉండగా, రిజర్వేషన్ ప్రాతిపదికన ఎస్టీలకు 37, ఎస్సీ-1, బీసీ-1, ఓసీ-1 చొప్పున సీట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. రూ.లక్షలోపు వార్షికాదాయం ఉన్న వారు మాత్రమే దరఖాస్తులకు అర్హులని తెలియజేశారు. వివరాలకు సెల్:9440204745 నంబరును సంప్రదించాల్సిందిగా కోరారు.

తిరుమల శేషాచలంలో కార్చిచ్చు

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శేషాచలం అటవీ ప్రాంతంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. తిరుమల నుంచి పాప వినాశనం మార్గంలో అటవీ ప్రాంతంలో మంటలు భారీ ఎత్తున ఎగిసి పడ్డాయి. వెంటనే గుర్తించిన టీటీడీ ఫారెస్ట్ అధికారులు అప్రమత్తమై మంటలను అదుపు చేసే ప్రయత్నం చేస్తున్నారు. కానీ ఎక్కడా అదుపు అయ్యే అవకాశాలు కనిపించడం లేదు. ఫైర్ ఇంజన్లు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో టీటీడీ.. అటవీశాఖ అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అన్నమయ్య మార్గం .. అటవీ ప్రాంతం కావడంతో ఫైర్ ఇంజన్లు వెళ్లలేకపోవడంతోనే మంటలను అదుపు చేయలేక పోతున్నామని అటవీ సిబ్బంది చెబుతున్నారు. పాపవినాశనం డ్యాం నుంచి అన్నమయ్య నడక మార్గంలో కొండలపై భారీగా మంటలు ఎగసిపడుతున్నాయి. ఇవి మరింత ఎక్కువ అవుతాయని .. కుమారధార, పసుపుధార వైపు మంటలు వ్యాపించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.



నేడు పెద్దాయన ఎస్సీవీ పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు జన్మదిన వేడుకలు శ్రీకాళహస్తి, సత్యవేడు, వెంకటగిరి నియోజకవర్గాల వ్యాప్తంగా శనివారం ఘనంగా జరగనున్నాయి. ఆ మేరకు ఆయన అభిమానులు ఏర్పాట్లలో తలమునకలై ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడును శ్రీకాళహస్తి ప్రజలు పెద్దాయనగా పిలుచుకుంటూ ఉంటారు. ఆయన దాతత్వ గుణాన్ని చూసి కలియుగ దానకర్ణుడుగా అభివర్ణిస్తూ ఉంటారు. ఎముకలేని చేయి తీరుగా ఆయన శ్రీకాళహస్తి, సత్యవేడు, వెంకటగిరి నియోజకవర్గ ప్రజలకు చేసిన సామాజిక సేవలే అందుకు నిదర్శనం. 2004లో ఎమ్మెల్యేగా గెలిచిన ఎస్సీవీ నాయుడు శ్రీకాళహస్తి రాజకీయాల్లో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని లిఖించుకున్నారు. ముఖ్యంగా ఆయన ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా 40 వేల మంది పేదలకు సొంతింటి కల నెరవేర్చారు. శ్రీకాళహస్తి ప్రాంత వాసుల తాగు, సాగు నీటి సమస్యను తీర్చేందుకు ప్రతిష్టాత్మక ఎస్ఎస్ కెనాల్, మల్లెమడుగు, బాలాజీ రిజర్వాయర్ ప్రాజెక్టులు ఎస్సీవీ హయాంలోనే రూపుదిద్దుకున్నాయి. అంతేకాకుండా శ్రీకాళహస్తి- రేణిగుంట పట్టణాలకు తాగునీటి సమస్య తీర్చేందుకు రూ.65 కోట్ల వ్యయంతో ఈ రెండు పట్టణాల మధ్య పైపులైను వేయించారు. శ్రీకాళహస్తి పట్టణంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు రింగ్ రోడ్డును నిర్మించారు. యానాదులకు ఉన్నత విద్య అందించడంలో భాగంగా కాలేజ్ ఆఫ్ ట్రైబల్ ఎక్సలెన్సీ కాలేజీని రాజీవ్ నగర్ వద్ద నెలకొల్పారు. వ్యాపారవేత్తగా, ఏ-1 కాంట్రాక్టర్ గా, స్టోన్ క్రషర్ అధినేతగా ఆయన ఈ మూడు నియోజకవర్గాల్లో గుడులు, బడుల నిర్మాణం కోసం ఇతోధికంగా విరాళాలు అందించారు.

వేసవి శిక్షణ శిబిరం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బాలకేంద్రం ఆధ్వర్యంలో బాల బాలికలకు ట్రైనింగ్, ఎంబ్రాయిడరీలపై ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటన తెలిపారు. ఈ శిబిరంలో 8 ఏళ్ల నుంచి 16 ఏళ్లలోపు వయసు విద్యార్థులు చేరవచ్చని, ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. నేటి నుంచి జూన్ 10వ తేదీ వరకు నిర్వహించే ఈ శిక్షణ అనంతరం, సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. ఈ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని ప్రభావతి నిర్వాహకురాలు తెలిపారు.

చలి వేంద్రంలో అంబలి, మజ్జిగ పంపిణీ



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరు మండలంలో అఖిల భారత క్షత్రియ సంఘం తరపున మున్సిపాలిటీ పరిధిలోని కార్వేటి నగర్ రోడ్డు, హిమజ స్కూల్ చలివేంద్రం వద్ద ప్రజలకు అంబలి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హిమజా నిషిద్ర రాజు, విద్యా సంస్థల అధినేత సురేందర్ రాజులు వేసవి తాపానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, అఖిల భారత క్షత్రియ మహాసభ సభ్యులు రామ్మోహన్ వర్మ, రామచంద్ర రాజు, విష్ణువర్మ, చంద్రబాబు, ప్రసాద్ వర్మ, సభ్యులు పాల్గొన్నారు.

దీపరెడ్డికి డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం గృహ విజ్ఞానశాస్త్ర విభాగపు పరిశోధక విద్యార్థి దీపరెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు సీతా దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. గృహ విజ్ఞానశాస్త్ర ఆచార్యులు డాక్టర్ అనురాధ పర్యవేక్షణలో " ప్రీ-స్కూల్ (3-6 సంవత్సరాల) పిల్లలలో పోషకాహార స్థితి, ప్రవర్తన సమస్యలు, ముఖ్యంగా శ్రద్ధ లోటు హైపరాక్టివ్ డిజార్డర్ ఉన్న పిల్లలకు సంబంధించి, కొన్ని అభిజ్ఞ, వ్యక్తిగత వేరియబుల్స్‌కు సంబంధించిన" అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వివరించారు. ఆమె జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్స్‌లో అనేక పరిశోధన పత్రాలను ప్రచురించారు. దీప రెడ్డికి డాక్టరేట్ రావడం పట్ల పలువురు అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు అభినందనలు తెలిపారు.

టీడీపీకి మహిళా శక్తి కొండంత అండ



లతా సుబ్రహ్మణ్యం రెడ్డిని పరామర్శిస్తున్న పులివర్తి సుధా రెడ్డి

ప్రజాశక్తి - రామచంద్రాపురం: తెలుగుదేశం పార్టీకి మహిళా శక్తి కొండంత అండ అని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధా రెడ్డి అన్నారు. అనారోగ్యంతో ఉండి, కోలుకుంటున్న టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, రామచంద్రాపురం మండలం, కుప్పం బాదూరుకు చెందిన లతా సుబ్రమణ్యం రెడ్డిని సుధా రెడ్డి కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా సుధా రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి లతా సుబ్రమణ్యం రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అక్షర ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు హరిబాబు, ఉపాధ్యక్షులు శేఖర్, వెంకటేష్ నాయుడు, గురు మోహన్ సుధా రెడ్డికి ప్రముఖ చిత్రకారులు చిత్రించిన అమూల్యమైన చిత్రపటాలను జ్ఞాపకాలుగా అందించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, శ్రావణ్ కుమార్, ఐ టి డి పి లెక్కల దినేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

10 సప్లిమెంటరీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ఐదు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షలు రాయనున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్టు ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యంలు తెలిపారు. శుక్రవారం ఆయన నెలవాయి గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సప్లమెంటరీ విద్యార్థుల ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటలు వరకు తరగతులు నిర్వహిస్తున్నారని, విద్యార్థులు తప్పిన సబ్జెక్టులను చదివిస్తున్నారని తెలిపారు. అలాగే సెలవు రోజుల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతుల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులంతా విద్యార్థులను దత్తత తీసుకుని చదివిస్తూ, అందరు ఉత్తీర్ణులయ్యేలా కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన వెంకటరత్నమ్మ




ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండల ప్రజా పరిషత్ అధికారిణిగా శుక్రవారం వెంకటరత్నమ్మ పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో నాగలాపురం మండలంలో ఈవోపీ ఆర్డిగా పనిచేస్తూ ప్రమోషన్ మీద బుచ్చినాయుడు కండ్రిగ ఎంపీడీవోగా వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 28 పంచాయతీలలో ఎలాంటి సమస్యలు ఉన్నా, పంచాయతీ అధికారులు, కార్యదర్శులు, సర్పంచ్‌ల సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ వేసవి కాలం నీటి ఎద్దడి ఎక్కువగా ఉంటుంది కాబట్టి, వారంలో మూడు నాలుగు రోజులు ప్రతి పంచాయతీ సందర్శించి అక్కడ పరిస్థితులను బట్టి చర్యలు తీసుకుంటానని తెలియజేశారు. అంతేకాకుండా ఈవోపీఆర్డి నుండి ఎంపీడీవోగా ప్రమోషన్ మీద రావడం చాలా సంతోషంగా ఉందని, బుచ్చినాయుడు కండ్రిగను అభివృద్ధి మండలముగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలోఎంపీడీవో, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై చర్యలేవీ..?

- చర్యలు తీసుకునే బాధ్యత రెవెన్యూ శాఖదే : ఆర్ అండ్ బి డిఈ
- ప్రతి ఒక్కరికీ బాధ్యత ఉంటుంది : ఎమ్మార్వో

ప్రజాశక్తి - నాయుడుపేట: ప్రభుత్వ భూములపై పూర్తి బాధ్యత రెవిన్యూ శాఖకే ఉంటుందని ఆర్ అండ్ బి డిఈ పరమేశ్వరి పేర్కొన్నారు. ఏ శాఖకు సంబంధించిన భూములైనా ఆక్రమణలకు గురైతే వాటిని కాపాడాల్సిన బాధ్యత, చర్యలు తీసుకునే హక్కు పూర్తిగా రెవెన్యూ అధికారులకే ఉంటుందని హైకోర్టు ఒక తీర్పులో వెల్లడించారని ఆమె తెలియజేశారు. ఆర్ అండ్ బి శాఖలో అన్యాక్రాంతమవుతున్న భూములు గురించి ఆమెను వివరణ కోరగా ఆమె పై విధంగా స్పందించారు. నాయుడుపేటలో ఆర్ అండ్ బి శాఖ లోని భూ ఆక్రమణపై ప్రజాశక్తిలో వెలువడిన కథనాలపై ఆమెను వివరణ కోరగా.. ఆర్ అండ్ బి శాఖలో సిబ్బంది చాలా తక్కువగా ఉన్నారని, ఇలాంటి ఆక్రమణ పై చర్యలు తీసుకోవాలంటే రెవెన్యూ, మున్సిపాలిటీ, పోలీసులు ఈ మూడు శాఖల సహకారం కావాలని ఆ ప్రయత్నంలోనే ఉన్నామని తెలియజేశారు. నాయుడుపేట తహసిల్దార్‌కు ఈ ఆక్రమణలపై రెండు నెలల ముందు వినతిపత్రం ఇచ్చి ఉన్నామని, వాళ్లు ఇరువైపులా సర్వేలు నిర్వహించి హద్దులు చూపించాల్సి ఉందన్నారు. సర్వేయర్ సర్వే నిర్వహించిన తర్వాత వీరందరి సహకారంతో ఆక్రమణలను తొలగించి భూములను స్వాధీన పరుచుకుం టామని అందుకు ఎంత సమయం పడుతుందో స్పష్టంగా తెలియజేయలేమని చెప్పుకొచ్చారు. అయినా కోర్టులే ఆక్రమిత ప్రభుత్వ స్థలాల బాధ్యత రెవెన్యూ శాఖకు ఉందని చెప్తున్నా, మీడియా వారిని ప్రశ్నించకుండా మమ్మల్ని టార్గెట్ చేయడం సరికాదని తిరిగి మీడియానే ప్రశ్నించడం గమనార్హం. అన్ని స్థలాల గురించి పక్కన పెడితే పట్టణంలో ప్రజలకు ప్రమాదకరమైన కొన్ని స్థలాలు అక్రమణకు గురై ఉండడం వాటిపై కూడా తక్షణ చర్యలు తీసుకోలేమని చెప్పడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. పైగా వీరికి సంబంధించిన కోట్ల రూపాయలు విలువ చేసే భూములను ఆక్రమించుకుని బడా బాబులు దౌర్జన్యంగా వ్యవహరిస్తుంటే అందులోనూ వాటి వల్ల ప్రజలకు ప్రాణాలకు ప్రమాదాలు కలిగించే విధంగా ఉన్న స్థలాల విషయంలో కూడా ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడంలో అర్థం ఏమిటో వారే సమాధానం చెప్పాలి. కొంతమంది అక్రమ దారులు వాహనదారుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టేసేలా వారి



స్వలాభం కోసం ప్రభుత్వ స్థలాలను బహిరంగంగా ఆక్రమించుకుని వాటిని అద్దెలకిచ్చి అక్రమంగా ఆర్జిస్తుంటే వాటిని కాపాడవలసిన బాధ్యత గల అధికారులే అక్రమదారులకు వంత పాడుతూ ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై నాయుడుపేట తహసిల్దార్ రాజేంద్రను ప్రశ్నించగా ఆయన మాట్లాడుతూ ఆర్ అండ్ బి శాఖ వారు వారి స్థలాల గురించి తమకు విన్నపం పెట్టుకున్న విషయం వాస్తవమేనని, అందులో కొంత భాగం వరకు అనగా ప్రజలకు అవసరమైన ఇప్పుడు ప్రమాద భరితంగా ఉన్న స్థలాల వరకు సర్వే నిర్వహించి వారికి అందజేశామని, ఆ తర్వాత వారు మమ్మల్ని సంప్రదించలేదని కోర్టు ఆర్డర్ గురించి మాకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. ఆ విషయంలో పై అధికారుల నుంచి కూడా మాకు ఎలాంటి సందేశాలు రాలేదన్నారు. ఇక కోర్టు విషయం పక్కన పెడితే ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్నప్పుడు వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క అధికారికి ఉంటుం దని కానీ ముందుగా ఆ శాఖకు సంబంధించిన అధికారులు స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ఏ శాఖకు సంబంధించిన భూములు ఆక్రమణకు గురయ్యాయో, ఆ శాఖకు సంబంధిత అధికారులు వచ్చి మమ్మల్ని సంప్రదిస్తే తప్పకుండా మేము వారికి సహకరిస్తామని తెలియజేశారు. సర్వే పూర్తయిన తర్వాత ఆర్ అండ్ బి శాఖ వారు మమ్మల్ని ఇంతవరకు సంప్రదించలేదని ఇక్కడ ప్రతి ఒక్క శాఖలోనూ సిబ్బంది లోటు ఉందని అయినప్పటికీ ప్రభుత్వ భూముల ఆక్రమణల విషయంలో ప్రతి శాఖకు మా వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కాకపోతే ఇక్కడ ఆ శాఖ అధికారులు ముందుకు రావలసిన అవసరం ఉందని, అలా వచ్చినప్పుడు వారికి ప్రతి ఒక్క అధికారి సహకరిస్తారని తెలియజేశారు. వీరిక్కడ ఒత్తిళ్లకు లొంగుతూ తప్పించుకోవడానికి పక్క శాఖలపై తోసేస్తూ చేతులు దులుపుకుంటున్నారని ఇలాంటివి తగవని ప్రభుత్వ అధికారులందరికి ఏవరికి సంబంధించిన పనులు వారికి ఉన్నాయని, ఏ శాఖలో ఇబ్బందులు ఉన్నాయో వారు తెలియజేస్తే తప్ప వేరే అధికారులకు ఎలా తెలుస్తుందని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంలో ఆర్ అండ్ బి అధికారులు కోరితే ప్రతి ఒక్క అధికారి వారికి సహరిస్తారని స్పష్టం చేశారు. ఆర్ అండ్ బి అధికారులు ఇకనైనా మత్తు వదిలి ప్రభుత్వ భూములపై శ్రద్ధ చూపాలని ఆక్రమదార్లకు బుద్ధి చెప్పి ప్రభుత్వ భూములు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

3 శాతం వృద్ధి సాధించిన టాటా ఏఐజీబీ

ప్రజాశక్తి -। తిరుపతి టౌన్: గత ఏడాది వ్యవధిలో 82,000 పైచిలుకు పాలసీదారులకు కవరేజీని అందించడం ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్వ్యాప్తంగా తమ రిటైల్ హెల్త్ పోర్ట్ఫోలియోలో 3% వృద్ధి సాధించినట్లు భారత్‌లో అగ్రగామి జనరల్ ఇన్సూరెన్స్ సంస్థ టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ వెల్లడించింది. జాతీయ సగటు కన్నా ఆరోగ్య బీమా విస్తృతి తక్కువగా ఉంటున్న దక్షిణాది మార్కెట్లలో విశ్వసనీయమైన బీమా సాధనాలకు పెరుగుతున్న డిమాండ్‌కు ఈ వృద్ధి నిదర్శనంగా నిలుస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లోని 51 జిల్లాల్లో కంపెనీ తన కార్యకలాపాలను పటిష్టం చేసుకుంది. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, వరంగల్, కరీంనగర్, నెల్లూరులో కీలక శాఖలను ఏర్పాటు చేసింది. టాటా ఏఐజీ నెట్వర్క్, 1,600 పైగా ఆసుపత్రులు, 14,500 అడ్వైజర్లతో సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య, బీమా సేవలను మరింత అందుబాటులోకి తీసుకొచ్చి, జీవనోపాధి అవకాశాలను కూడా సృష్టిస్తోంది. నవజాత శిశువుల నుంచి సీనియర్ల వరకు, ఎటువంటి వయోపరిమితి లేకుండా అన్ని వర్గాల కస్టమర్లకు అనువైనదిగా, అందుబాటు ప్రీమియంలతో ఉండేలా మెడికేర్ సెలెక్ట్ రూపొందించబడిందని నిర్వహకులు తెలిపారు.

కిశోరి వికాసం.. బాలికల భవిష్యత్తుకు పునాది



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : కిశోరి వికాసం, బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది అని ఐ.సి.డి.ఎస్ ఇన్చార్జి సి.డి.పి.వో స్వరూపా రాణి పేర్కొన్నారు. గూడూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కిశోరి వికాసం – వేసవి సెలవుల కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 11–18 ఏళ్ల బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబన మెరుగు పరచడం ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. ఇందుకు ప్రతి గ్రామంలో బాలికల సంఘాలును ఏర్పాటు చేసి అవగాహన కల్పించడంతోపాటు సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించినునట్లు తెలిపారు. బాలికల్లో ఆత్మ రక్షణ శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేయడం, డిజిటల్ భద్రత, సైబర్ క్రైమ్, ఆన్లైన్ వేదికలపై జాగ్రత్తగా ఉండేలా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం బుజ్జమ్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్‌లు హైమావతి, చెంచు లక్ష్మి, మహిళా పోలీసులు, ఏ.ఎన్.ఎంలు, వి.ఓ.ఏలు, తదితరులు పాల్గొన్నారు.

గాండ్ల సంస్కృతిని భావితరాలకు అందించాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గాండ్ల తెలికుల సంస్కృతి, సాంప్రదాయాలను, కులవృద్ధులను భావితరాలకు అందించాలని అఖిల గాండ్ల తెలికుల ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వాకాటి హరికృష్ణ గాండ్ల సూచించారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం జరుగనున్న సంఘం ప్రథమ వార్షికోత్సవ సంబరాలలో భాగంగా తిరుపతిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో గాండ్ల , తెలికుల కుల వర్గాలకు చెందిన వారికి ఆత్మీయ పురస్కార కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ ఆత్మీయ పురస్కార కార్యక్రమానికి గాండ్ల, తెలికుల కుల బాంధవ్యులు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రామిశెట్టి, తిరుపతి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాలకృష్ణ, భాస్కర్ దేవరకొండ పాల్గొన్నారు.

రామచంద్ర యాదవ్‌కు సన్మానం




ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): టీటీడీ వాటర్ వర్క్స్ విభాగంలో పదవి విరమణ పొందిన రామచంద్ర యాదవ్‌ను బీసీ సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బిసి సంఘర్షణ సమితి నాయకులు అక్కినపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ రామచంద్ర యాదవ్ టిటిడిలో బీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలకు యూనియన్ ఏర్పాటు చేసి ఎన్నో సమస్యలను పరిష్కరించారన్నారు. పదవి విరమణ అనంతరం కూడా రామచంద్ర యాదవ్ బీసీల ఉద్యమాలకు సేవలు అందిస్తానని ముందుకు రావడం హర్షణీయమన్నారు. రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ శ్రీవారి సన్నిధిలో పనిచేయడం గొప్ప వరమని, అనేక యూనియన్లతో కలిసి పనిచేసి ఎంతోమంది సమస్యలను పరిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బుసగాని లక్ష్మయ్య, అశోక్ సామ్రాట్ యాదవ్, రమణ, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

రామాపురం ఎస్టి కాలనీలో పల్లెనిద్ర



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని రామాపురం పంచాయతీ ఎస్టీ కాలనీలో శుక్రవారం శ్రీకాళహస్తి రూరల్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రవి నాయక్ పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కాలనీలో నివసిస్తున్న వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీ పిల్లలకు బాలమిత్ర పుస్తకాలు, జామెంట్రీ బాక్సులు పంపిణీ చేశారు. విద్యార్థులకు చదువు విషయంలో ఎటువంటి సహాయం చేయడానికైనా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కాలనీ వాసులు మాట్లాడుతూ పాఠశాలలు పునః ప్రారంభం అయిన తరువాత పిల్లలను హాస్టల్లో చేర్పించడానికి సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కౌశిక్, కానిస్టేబుల్స్ భరత్, నాగరాజు, ఫిరోజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో భాష్యకార్ల సాత్తుమొర



ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: తిరుపతి శ్రీ గోవిందరాజ స్వామివారి ఆలయంలో 10 రోజుల పాటు జరిగిన భాష్యకార్ల ఉత్సవాలు శుక్రవారం సాత్తుమొరతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఇతర అధికారులు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

సామూహిక ఉపనయనాలు



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరు, శ్రీ గాయిత్రి దేవి బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో శ్రీ గాయిత్రి భవన్ లో సామూహిక నూతన యజ్ఞోపవీత ధారణ మహోత్సవాన్ని శుక్రవారం గౌరవ అధ్యక్షులు ఆలూరు రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి జిల్లా బ్రాహ్మణ సంఘాల సేవ సమాఖ్య కార్య నిర్వహణ అధ్యక్షుడు, తిరుపతి చిత్తూరు జిల్లాలో గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్, తిరుపతి బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ వేదం హరిప్రసాద్ హాజరైయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపనయనాలు చేయించుకొనుటకు తిరుపతి, పుత్తూరు, నగరి, శ్రీకాళహస్తి సూళ్లూరుపేట, రేణిగుంట నుంచి వటువులు పాల్గొన్నారు. వారికి జిల్లా సంఘం తరపున వేదం హరిప్రసాద్ వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు బ్రాహ్మణ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బాలాజీ, ప్రెసిడెంట్ రమేష్ బాబు, సెక్రటరీ విజయకుమార్, రేణిగుంట బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు రెడ్డి ప్రకాష్, సుళ్లూరుపేట బ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి మల్లికార్జున శర్మ, శివకుమార్, పద్మ, తిరుపతి జిల్లాల బ్రాహ్మణ సంఘాల సేవ సమితి కన్వీనర్ డాక్టర్ చక్రపాణి, బ్రాహ్మణ బంధుమిత్రులు, పుత్తూరు గాయిత్రి బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు చిట్టమూరు రమేష్ బాబు, వైస్ ప్రెసిడెంట్ తిప్పావజ్జుల సేతురామన్ శర్మ, సెక్రటరీ విజయ్ కుమార్, మాజీ అధ్యక్షుడు కే.బాలాజీ శర్మ, సంఘ సభ్యులు బాలాజీ రావు, కిరణ్ సురేష్. తిప్పా వజ్జుల సేతురామన్ శర్మ,టీచర్ హరి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కోదండ రామస్వామి పుష్పయాగానికి అంకురార్పణ

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్ : తిరుపతి, శ్రీ కోదండ రామస్వామివారి ఆలయంలో ఆదివారం జరుగనున్న పుష్పయాగానికి శుక్రవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ఆదివారం ఉదయం 11 గంటలకు స్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు నాలుగు మాడ వీధుల్లో స్వామి వారు భక్తులకు అభయమిస్తారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్ర బాబు, ఏఈవో బి.రవి, సూపరింటెండెంట్ ఎం.మునిశంకర్, టెంపుల్ ఇన్స్పెక్టర్ ఏ.ఎం.సురేష్ బాబు, గుణశేఖర్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


ప్రజాశక్తి -కోట : ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని వెలుగు సీసీ శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు ప్రాజెక్ట్ కార్యాలయంలో డ్వాక్రా సంఘాలతో ప్రకృతి వ్యవసాయంపై కోట మండలం చంద్రశేఖర పురంలో అవగాహన సదస్సు నిర్వహించారు. రసాయనాలతో పండించిన పంటలు తినడం వల్ల వ్యాధులు కొని తెచ్చుకుంటు న్నారన్నారు. ఆ పంట తినడం వల్ల జీవన విధానంలో అనేక రోగాల బారిన పడవలసి వస్తుందని అన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్న పంటలు అతివృష్టి, అనావృష్టిని తట్టుకోవడమే కాకుండా భూమిలో జీవరాశిని, జీవవైవిద్యాన్ని పెంపొందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ శాఖ మోడల్ మేకర్ ఐ.శ్రీనివాసులు మాట్లాడుతూ ఇంతకు ముందు రైతు సంఘాల ద్వారా జరిగిన ప్రకృతి వ్యవసాయం మహిళ సాధికార సంస్థల ద్వారా మరింతగా విస్తరించేందుకు ప్రతి గ్రామంలో ప్రతి మహిళ ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటించాలని కోరారు. ప్రతి నెల వెలుగు ఆఫీస్ దగ్గర పంటల చీడ పీడలకు కషాయాల తయారీ, మొక్కల పెరుగుదలకు పూత, పిందె, మొక్కలు ఆరోగ్యంగా పెరగడానికి గ్రోత్ ప్రమోటర్స్ తయారీ విధానాలను తయారు చేసి అందరికీ అవగాహన కలిగించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. పలు ప్లకార్డులతో ర్యాలీ చేపట్టి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిసి శ్రీకాంత్, ప్రకృతి వ్యవసాయ మోడల్ మేకర్ శ్రీనివాసులు, మండల ఇంచార్జి పద్మ, విఓఏ మునెమ్మ, ఐ సి ఆర్పీ భాగ్యలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

తుమ్మలగుంటలో గంగమ్మకు పొంగళ్లు




ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: తిరుపతి రూరల్ మండలం, తుమ్మల గుంటలో గంగమ్మ జాతర వైభవంగా జరిగింది. శుక్రవారం రాత్రి గంగమ్మ తల్లికి మహిళలు అభిషేకం, పూజలు చేసి, పాల పొంగళ్లు పెట్టి నైవేద్యంగా సమర్పించారు. చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మీ దంపతులతో పాటు తుడా మాజీ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఈ పూజల్లో పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పరిసరాలు శుభ్రం చేస్తున్న డిఎస్పీ గీతా కుమారి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గూడూరు డిఎస్పీ గీతా కుమారి పేర్కొన్నారు. శుక్ర వారం గూడూరు పట్టణంలోని సబ్ డివిజనల్ పోలీసు కార్యాలయ ఆవరణలో స్వర్ణాంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ పాల్గొని, పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ ప్రతి ఒక్క రూ విధిగా మొక్కలు నాటలన్నారు. ఈ కార్యక్ర మంలో కార్యా లయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం షాపులను గుడి, బడి, హాస్పిటల్స్, నివాస ప్రాంతాలకు దూరంగా ఏర్పాటు చేయాలని, లిక్కర్ బాటిల్స్ విక్రయించడమే తప్ప, కూర్చోని త్రాగడానికి అవకాశం లేదని, దుకాణాల ద్వారానే లిక్కర్ అమ్మాలని బెల్ట్ షాపులను ఏర్పాటు చేయకూడదనే నిభందనలు బుచ్చినాయడు కండ్రిగలో మద్యం షాపు నిర్వాహకులు తుంగలో తొక్కారు. మండలంలో ఐదు మద్యం షాపులు తెరవగా గత నెలలో కల్లు గీత కార్మికుల కోసం మరో మద్యం షాపు మంజూరై ప్రారంభించారు. మద్యం షాపుల వద్ద గుడారాలు వేసి బార్లు నిర్వ హిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం షాపుల ముందు సిసి కెమెరాల నిఘాలను ఏర్పాటు చేయాల్సిఉన్నా, ఏ ఒక్క షాపు నిర్వాహకుడు అమలుపరచడం లేదు. ఎవ్వరికైతే ప్రభుత్వ లాటరీ ద్వారా మద్యం షాపులను కేటాయించారో వారే నిర్వహించాలని ఉన్నా అదీ ఆచరణలో లేదు. ఎంఆర్పీ కన్నా ఎక్కువ రేటుకు అమ్మకూడదన్న నిబంధనను సిండికేట్లు ఏకమై ప్రతి క్వార్టర్ భాటిల్ పై 10 రూపాయలు పెచ్చుగా అమ్ముకుంటున్నారు. ఇన్ని జరుగుతున్న ఎక్సైజ్ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. వారికి రావలసిన మామూళ్ళు తీసుకుని ఏమి ఎరగనట్లు నిద్రావస్థలో ఉన్నారు. పలు మద్యం షాపులకు ఆనుకొని సిట్టింగ్ కోసం షెడ్లు, రూములను ఏర్పాటు చేసి మద్యం సేవించడానికి కుర్చీలు బల్లలను ఏర్పాటు చేశారు. నిర్వహకులే గ్లాసులు, తిను బండారాలు అమ్ముతున్నారు. ఈ విధంగా మద్యం దుకాణాలు బార్లను తలపిస్తున్నాయి. ఎక్సైజ్ అధికారులు అండదండలతోనే ఈ తతంగమంతా నడుస్తోందని సమాచారా. మద్యం షాపుల వద్ద మద్యం తాగడాన్ని అరికట్టాలని, గురువారం సీపీఐ నాయకులు శ్రీకాళహస్తి ప్రోహిబిషన్, ఎక్సైజ్ ఎస్ఐకి వినతి పత్రం అందజేశారు. మద్యం షాపుల నిర్వహణలో నిబంధనలు పాటించేలా చూడాలని కోరారు.